# ప్రజాసంక్షేమం పట్టని కాంగ్రెస్

- రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతున్న రాహుల్‌గాంధీ
- సీఎం కుర్చీ కోసం కాంగ్రెస్‌లో కుమ్ములాటలు
- బీఆర్ఎస్, బీజేపీ ఎప్పటికీ ఒక్కటి కాదు..
- దేశవ్యాప్తంగా బలంగా మారుతున్న 'గులాబీ' పార్టీ
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- బీఆర్ఎస్‌లో చేరిన 600 మంది ప్రతిపక్ష నేతలు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, అక్టోబర్ 19 : కాంగ్రెస్ నాయకులు ఏనాడూ ప్రజాసంక్షేమం గురించి పట్టించుకోలేదని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. రాష్ట్రం కోసం ఏదో చేశామంటూ స్థానిక నాయకులు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను రాహుల్‌గాంధీ చదువుతున్నారన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్‌ది కుటుంబ పాలన అంటూ కాలం వెల్లదీస్తున్నారని, మీ తాతముత్తాతల నుంచి మీరు చేస్తున్నదేమిటంటూ ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ కుటుంబసభ్యులు రాత్రి, పగలు తేడా లేకుండా తెలంగాణ ఉద్యమం చేశారని, నేడు రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములవుతున్నారన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను చూస్తుంటే కడుపు మండి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ ఎప్పటికీ ఒక్కటి కాదన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటిగా ఉంటూ.. ఒక్కోసారి ఒక్కొక్కరు అధికారంలోకి వస్తూ ప్రజలకు మంచిచేయడం మరిచిపోయారన్నారు. రాష్ట్రంలో ఇది చేస్తాం.. అది చేస్తాం అని అంటున్న కాంగ్రెస్ నేతలు ప్రస్తుతం అధికారంలో ఉన్న చోట ఎందుకు అమలు చేయడం లేదన్నారు. కేవలం అధికారం వస్తే చాలు.. ప్రజలు ఏమైపోతే మాకేంటి అనేలా కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ఉందన్నారు. 60 శాతం ఉన్న బీసీలకు మీ పాలనలో బీసీ మంత్రిత్వ శాఖ ఎందుకు ఇవ్వలేదని, బీఆర్ఎస్ పాలనలో బీసీ మంత్రైనా తనకు 7 శాఖలను కేటాయించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని అన్నారు. గత పాలకులు బీసీలను కేవలం ఓటు యంత్రాలుగా భావించారన్నారు.

**కనీస పరిజ్ఞానం లేని నేతలు..**

కాంగ్రెస్ పార్టీ నేతలు అరిగిపోయిన రికార్డులను స్మరించుకుంటూ.. నేనంటే నేను సీఎం అంటూ ఎవరికి వారు ప్రచారం చేసుకుంటూ లోలోపల కుమ్ములాడుతున్నారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేయలేదని, అలాంటప్పుడు రూ.లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 హామీలు నెల రోజులు కూడా అమలు కాలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట రూ.కోట్ల అవినీతికి పాల్పడి కనీసం కరెంట్ కూడా ఇవ్వలేక దివాళా తీశారన్నారు. రాహుల్‌గాంధీ ప్రచారం ప్రారంభించిన రామప్ప టెంపుల్‌కు యునెస్కో గుర్తింపు తీసుకొచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ నేతలు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. ఇసుక, మైనింగ్, వైన్ మాఫియా అంటేనే కాంగ్రెస్ అని, ఆ పార్టీ అధ్యక్షులు కేవలం 3 గంటలు కరెంట్ సరిపోతుందని ఎంతో అహంకారంగా మాట్లాడుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నో పార్టీలు మారి ఇప్పుడు కాంగ్రెస్‌కు అధ్యక్షుడయ్యారన్నారు. మా నాయకుడిలాగా ఒకేమారు టికెట్లు కేటాయించే దమ్ముందా అని ప్రశ్నించారు. గాంధీభవన్ నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్లు కేటాయించాలని సూచించారు. దేశంలోనే అత్యుత్తమ మ్యానిఫెస్టో తమదని, పదేండ్ల పాలనలో ఎలాంటి ఘర్షణలు జరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దొంగ సర్వేలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మహబూబ్‌నగర్ చుట్టూ సమాంతరంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని, ఆ దిశగా అడుగులేస్తున్నామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ప్రజలకు మంచి చేయాలనే తపన తప్పా మరేమీ లేదన్నారు. ప్రజలు 45 రోజులు శ్రమించి పనిచేస్తే ఐదేండ్లు ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం పాటుపడుతానన్నారు. బీఆర్ఎస్ పార్టీ దేశవ్యాప్తంగా దూసుకెళ్తున్నదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రహెమాన్, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా చైర్మన్ వెంకన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, నాయకులు రామకృష్ణ, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లోకి ప్రతిపక్షాల క్యూ..**

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 19 : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరేందుకు క్యూ కడుతున్నారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో గుంటూరు జిల్లాకు చెందిన కోటేశ్వర్‌రావు, నాగేశ్వర్‌రావు, బుగ్గయ్య, హన్మయ్య, లక్ష్మణ్‌తో సహా 100 మంది గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే మెడికల్ ఏజెన్సీస్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, శ్రీనివాస్, రాబర్ట్ సన్నీ, వెంకటేశ్‌తో సహా మరో 100 మంది, న్యూమోతీనగర్‌కు చెందిన బీజేపీ నేతలు వెంకట్‌స్వామి, ప్రవీణ్‌కుమార్, నరేందర్, నాగరాజు, నరేశ్, బాలకృష్ణతో సహా 100 మంది, టీడీ గుట్టకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నేతలు, ముదిరాజ్ సంఘం నాయకులు 100 మంది, రజక సంఘం నేతలు నర్సింహులు, పార్వతి, లక్ష్మి, సంజయ్, వెంకటయ్య, సువర్ణతోసహా 200 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు బతుకుదెరువు చూపేదిగా తెలంగాణ ఎదిగిందన్నారు. ఏపీలో కంటే తెలంగాణలో ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంటి స్థలాలు కూడా ఇచ్చారని గుంటూరుకు చెందిన నేతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నర్సింహులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లను ప్రలోభపెడితే చర్యలు

- ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్తే సీజ్ చేస్తాం
- నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతం

నారాయణపేట, అక్టోబర్ 19 : ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకెళ్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ యోగేశ్ గౌతం హెచ్చరించారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేసి రూ.15,39,700 పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. నారాయణపేటలో రూ.1,62,800, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.60 వేలు, దామరగిద్దలో రూ.80 వేలు, మద్దూర్‌లో రూ.55 వేలు, మాగనూర్‌లో రూ.90 వేలు, మక్తల్‌లో రూ.5.20 లక్షలు, ఊట్కూర్ పరిధిలో రూ.2,42,500, కోస్గిలో 1.21 లక్షలు, ధన్వాడలో 2,08,400 పట్టుకున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రూ.50వేల కంటే ఎక్కువ తీసుకెళ్తే తగిన పత్రాలు, రశీదు ఉండాలన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్‌కు సంబంధించి విద్యార్థులు, ఔత్సాహిక యువతకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. షార్ట్‌ఫిల్మ్ 3 నిమిషాల నిడివి ఉండాలన్నారు. అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో సేవ, ఇతర సందర్భాల్లో కీర్తి ప్రతిష్టలు పెంపొందించే అంశాలు ఉండాలన్నారు. గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకు తీసిన 3 ఫొటోలు, షార్ట్‌ఫిల్మ్‌ను పూర్తి వివరాలతో పెన్‌డ్రైవ్‌లో అప్‌లోడ్ చేసి ఈనెల 25లోగా ఎస్పీ కార్యాలయంలో అందజేయాలన్నారు.



మాగనూర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై మల్లేశ్

**వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత**

కోస్గి/మాగనూరు/ఊట్కూరు, అక్టోబర్ 19 : కోస్గి మండలంలో వాహన తనిఖీలు నిర్వహించగా రూ.1.21 లక్షలను సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. రాయిచూర్ నుంచి దేవరకద్ర వైపు వెళ్తున్న వాహనంలో రూ.90 వేలు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు మాగనూర్ ఎస్సై మల్లేశ్ చెప్పారు. మాగనూర్ మండలం వర్కూర్ గ్రామానికి చెందిన ఊరిముందరి బాలప్ప నారాయణపేటకు కారులో రూ.58,500 తీసుకెళ్తుండగా ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామని ఎస్సై గోకారి పేర్కొన్నారు.

**జడ్చర్లలో రూ.3.75 లక్షలు..**

జడ్చర్లటౌన్, అక్టోబర్ 19 : జడ్చర్ల పట్టణంలోని 44వ జాతీయరహదారి ఫ్లైఓవర్ వద్ద కారులో తరలిస్తున్న రూ.3.75 లక్షలను పోలీసులు పట్టుకున్నారు. గురువారం పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద నగదు గుర్తించి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. నగదును విచారణ నిమిత్తం కలెక్టరేట్ ప్రత్యేక సెల్‌కు పంపించినట్లు జడ్చర్ల సీఐ రమేశ్‌బాబు తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న పేట కలెక్టర్ శ్రీహర్ష

# డబుల్ ఓట్లు ఉండొద్దు

- నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, అక్టోబర్ 19 : కొత్తగా ఓటరు జాబితాలో డబుల్ ఓట్లు లేకుండా సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఎంసీసీ రిపోర్టును పంపించాలన్నారు. ప్రతి ఆన్‌లైన్ రిపోర్టును క్షుణంగా తనిఖీ చేయాలన్నారు. రాజకీయ పార్టీలు సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 3,100 లీటర్ల మద్యం రూ.54లక్షల నగదు పట్టుకున్నామన్నారు. రైతులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై మూడు కేసులు నమోదు చేశామన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1950కు 50 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అనుమతులు అవసరమున్నా సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీ విజిల్ యాప్‌పై గ్రామాల్లో పోస్టర్లు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో రాంచందర్, తాసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# అరుణాచలానికి ప్రత్యేక బస్సు

మహబూబ్‌నగర్‌టౌన్, అక్టోబర్ 19 : తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలానికి పౌర్ణమి సందర్భంగా మహబూబ్‌నగర్ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డీఎం సుజాత గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న సాయంత్రం 5 గంటలకు మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతుందని, కాంచీపురం, గోల్డెన్‌టెంపుల్ దర్శనం ఉంటుందన్నారు. 30వ తేదీ తిరిగి మహబూబ్‌నగర్ చేరుకుంటుందన్నారు. అరుణాచలం వెళ్లే భక్తులకు టీఎస్ఆర్టీసీ టూర్ ప్యాకేజ్ ఉందని, రూ.3,500 ధర నిర్ణయించినట్లు తెలిపారు. సమాచారం కోసం 9441162588 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



నెట్‌బాల్ జట్టుతో డీవైఎస్‌వో శ్రీనివాస్

# జాతీయస్థాయి నెట్‌బాల్ టోర్నీకి రాష్ట్ర జట్టు

మహబూబ్‌నగర్‌టౌన్, అక్టోబర్ 19 : గోవా రాష్ట్రంలోని పంజియమ్‌లో ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న 37వ జాతీయ నెట్‌బాల్ టోర్నీలో పాల్గొనేందుకు రాష్ట్ర జట్టు బయలుదేరాయి. జిల్లా కేంద్రంలోని స్టేడియంలో డీవైఎస్‌వో శ్రీనివాస్ గురువారం క్రీడాకారులకు ట్రాక్ సూట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు టోర్నీలో ప్రతిభ చాటి జాతీయజట్టుకు ఎంపికకావాలని ఆకాంక్షించారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదువలేదన్నారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విక్రమ్‌ఆదిత్యరెడ్డి, ఖాజాఖాన్, ప్రతినిధి సాదత్‌ఖాన్, కోచ్‌లు సోహెల్‌ఉర్ రహెమాన్, మనోజ్‌కుమార్, అరుణజ్యోతి, స్వప్న, వినోద్, సునీల్, మేనేజర్లు సాదత్‌ఖాన్, రఘురాం, ఆఫ్రిన్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్రస్థాయి ఆర్చరీకి జిల్లా క్రీడాకారుల ఎంపిక**

ఈ నెల 21, 22వ తేదీల్లో రంగారెడ్డి జిల్లా కొల్లూరులో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్, జూనియర్ ఆర్చరీకి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు సంఘం జిల్లా కార్యదర్శి రాంచందర్ బుధవారం తెలిపారు. సుజాత, సునీత, రవి, సమీక్ష, సాయిమణిశ్వర్, కృతిక్, గౌతమ్, వంశీ, కౌశిక్, యశ్వంత్, మనోజ్ఞ ఎంపికయ్యారన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన ఆర్చరీ క్రీడాకారులు